

డ్రగ్స్ లేని సమాజమే లక్ష్యం

కోటబొమ్మాళి : ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్‌లో డ్రగ్స్ లేని రాష్ట్రంగా మార్చాలని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని వ్యవసాయశాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. విద్యార్థులే దీనిని బాధ్యతగా తీసుకుని అరికట్టేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఆలయం వద్ద మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కోసం చేపట్టిన 'అభ్యుదయం' సైకిల్ యాత్రను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యరకమంలో ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి, టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, కింజరాపు హరిప్రసాద్, బోయన రమేష్ పాల్గొన్నారు.



సైకిల్ తొక్కుతున్న మంత్రి, ఎస్‌పి

చర్చ...రచ్చ

- ఉపాధి హామీ, ధాన్యం కొనుగోలుపై రభస
- నిరసనలు, కేకల మధ్య సాగిన జెడ్‌పి సర్వసభ్య సమావేశం
- మిల్లర్ల అసోసియేషన్ దోపిడితో రైతులకు నష్టం: కూన రవి
- అచ్చెన్నకు అసోసియేషన్ ముడుపులు : దువ్వాడ వాణి



ఎమ్మెల్యే కూన రవికుమార్‌తో వాగ్వివాదానికి దిగిన కంచిలి జెడ్‌పిటిసి దేవదాస్‌రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో టిడిపి కూటమి ఎమ్మెల్యేలు, వైసిపి సభ్యుల మధ్య పలుమార్లు రసాభసా చోటు చేసుకుంది. నిరసనలు, కేకల మధ్య సమావేశం సాగింది. స్థానిక జిల్లా జెడ్‌పి సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు, నాసిరకం పనులు, ధాన్యం కొనుగోలులో రైతుల నుంచి దోపిడీ తదితర అంశాలపై టిడిపి, వైసిపి సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. మీ నేత దొంగని వాళ్లు, కాదు మీ నాయకుడే అంటూ వీళ్లు పరస్పరం వాదులాడుకున్నారు. మూడు పర్యాయాలు సభ్యుల మధ్య వివాదం, గొడవలతో గందరగోళం చోటు చేసుకుంది. చివరకు సభ్యుల వాగ్వివాదం మధ్య జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ సమావేశాన్ని అర్థాంతరంగా ముగించారు. ఉపాధి హామీ పనుల్లో నాసిరకం పనులు, టెండర్లను పిలవకుండా పనులు చేయడమేమిటంటూ ఎచ్చెర్ల ఎంపిపి చిరంజీవిరావు లేవనెత్తిన అంశం సమావేశాన్ని వేడెక్కించింది. చట్టం, నిబంధనలపై మాట్లాడానికి ఇది వేదిక కాదని, పనులు నాసిరకంగా ఉంటే మాట్లాడాలని ఎమ్మెల్యే కూన రవి కుమార్ సూచించారు. గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన వెండర్ విధానాన్నే ప్రస్తుత ప్రభుత్వమూ కొనసాగిస్తోందే తప్ప కొత్తగా టెండర్ల పద్ధతిని తీసుకురాలేదని చెప్పారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ విలేజ్ క్లినిక్ నిర్మాణాలనూ పూర్తి చేసినా వాటిని ఎం-బుక్‌లో నమోదు చేయలేదన్నారు. దీనిపై ఎస్‌ఇ సత్యనారాయణ మాట్లాడుతూ బిల్లులు అప్‌లోడ్ చేశామని, చెల్లింపులు జరగుతున్నాయంటూ చెప్పడంతో వైసిపి సభ్యులు పలువురు ఎవరికి ఇచ్చారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. 2014-19 కాలంలో చేపట్టిన బిల్లులను వైసిపి ప్రభుత్వం ఆపేయలేదా అని ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే కూన రవికుమార్ గత ప్రభుత్వ హయాంలో బిల్లులు చెలింపులో నాటి ప్రభుత్వ నిర్వాకాన్ని వివరిస్తున్న సమయంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ జోక్యం చేసుకుంటూ అసెంబ్లీ, డిఆర్‌సి వేదికల్లో మీకు మాట్లాడటానికి అవకాశం ఉంటుందని, తమ సభ్యులకూ అవకాశం ఇవ్వాలంటూ చెప్పడంపై ఎమ్మెల్యే కూన రవికుమార్ తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. మరోవైపు వైసిపి సభ్యులు మాటల దాడికి దిగటంతో తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. చైర్‌పర్సన్ పిరియా విజయ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలంటూ ఆయన కొద్ది సేపు నిల్చొని నిరసన తెలిపారు. ఇదే అంశంపై ఎమ్మెల్యేలు నిమ్మక జయకృష్ణ, ఈశ్వరరావు మాట్లాడుతూ జెడ్‌పి చైర్‌పర్సన్ ఇతర వైసిపి సభ్యుల వ్యాఖ్యల పట్ల మండిపడ్డారు. ఇదే సందర్భంలో టెక్కలి జెడ్‌పిటిసి దువ్వాడ వాణి తమకు ప్రాధాన్యం ఇవ్వాలంటూ వేదిక వద్ద బైఠాయించారు. ఎమ్మెల్యే రవికుమార్‌కు. దువ్వాడ వాణికి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. వైసిపి సభ్యులు పలువురు ఇరువుని శాంతింపచేయడంతో వివాదం సద్దుమణిగింది.

ధాన్యం కొనుగోలు అంశంపై మరోసారి రచ్చ

ఉపాధి హామీ తర్వాత ధాన్యం కొనుగోలుపై చర్చ సందర్భంగా మరోసారి రచ్చ జరిగింది. మిల్లులకు ధాన్యం తీసుకువెళ్తున్న రైతుల నుంచి మిల్లర్లు ఎనిమిది కేజీలు ధాన్యం అడుగుతున్నారని, ఎందుకివ్వాలని తాను ఆరా తీస్తే మిల్లర్ల అసోసియేషన్ డబ్బులు కట్టాలని కొందరు మిల్లర్లు చెప్తున్నారని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. అసోసియేన్ డబ్బులు అడగడం ప్రభుత్వానికి చెడ్డపేరని, బాధ్యులెవరో తేల్చాలని అధికారులను అడిగారు. మిల్లర్లు అదనంగా ఐదు నుంచి ఎనిమిది కేజీల ధాన్యం అడుగుతున్నారంటూ పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇదే సందర్భంలో టెక్కలి జెడ్‌పిటిసి సభ్యులు దువ్వాడ వాణి మాట్లాడుతూ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ వసూలు చేస్తున్న సొమ్ములు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి వెళు తున్నాయని చెప్తూ గత ప్రభుత్వ హయాంలో విత్తనాల నుంచి ధాన్యం కొనుగోలు వరకు ఎటువంటి సమస్యలుండేవి కావంటూ వ్యాఖ్యానించడంపై మరోసారి వివాదం రేగింది. ఎమ్మెల్యేలు కూన రవికుమార్, నిమ్మక జయకృష్ణ, ఎన్.ఈశ్వరరావు ఈ వ్యాఖ్యలను తప్పుపట్టారు. దీనిపై తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఇదే సమయంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ సమావేశం ముగిసినట్టుగా ప్రకటించారు. సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్‌పి సిఇఒ సత్యనారయణ, డిసిసిబి చైర్మన్ శివాల సూర్యనారయణ, డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్ పలువురు జెడ్‌పిటిసిలు,ఎంపిపిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పిల్లలందరికీ పోలియో చుక్కలు

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించేలా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. కోటబొమ్మాళి ఎన్‌టిఆర్ భవన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని పల్స్ పోలియో ఇమ్యూనైజేషన్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి జిల్లాస్థాయి నుంచి గ్రామీణ స్థాయి వరకు అన్ని స్థాయిల్లో సమగ్ర ఏర్పాట్లు చేయాలని సూచించారు. డిఎంహెచ్‌ఒలు, ఇమ్యూనైజేషన్ అధికారులు, ఇతర వైద్యాధికారుల ఆధ్వర్యాన జిల్లా, మండల, పట్టణ, గ్రామీణ స్థాయిల్లో సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. పల్స్ పోలియో కార్యక్రమం కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఈ నెల 22, 23 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేయడానికి ప్రత్యేక బృందాలను సిద్ధం చేయాలని సూచించారు. శివారు ప్రాంతాలు, నిర్మాణ ప్రాంతాలు, ఇటుక బట్టీలు, వలస కార్మికులు నివసించే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న పల్స్‌పోలియో ఇమ్యూనైజేషన్ కార్యక్రమం కింద ఐదు సంవత్సరాల లోపు వయస్సు గల ప్రతి పిల్లవాడికీ పోలియో చుక్కలు వేయడం లక్ష్యమని పేర్కొన్నారు. పోలియో వ్యాధి నివారణకు పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత కీలకమని, తల్లిదండ్రులందరూ తమ పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించి ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ఐదేళ్లలోపు చిన్నారులకు కచ్చితంగా పోలియో చుక్కలు వేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి నాయకులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను అవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

చిన్నారుల చిరునవ్వులకు 'ముస్తాబు'



విద్యార్థినులతో కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- ఎచ్చెర్ల, లావేరు, బూర్జ

ముస్తాబు కార్యక్రమం విద్యార్థుల ఆత్మవిశ్వాసానికి, క్రమశిక్షణకు తొలి మెట్టు అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఎచ్చెర్ల మండలం గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన 'ముస్తాబు' కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పనాలయుడు, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. చిన్నారుల అద్దం ముందు నిలబడి తనను తాను చక్కదిద్దుకుంటున్న తీరును వారు స్వయంగా పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత అవగాహన పెంచేందుకు కూటమి ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆలోచనతో పుట్టిన ఈ ముస్తాబు విధానం రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దీనిని అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని నిర్ణయించారని వివరించారు. ఈ విధానం వల్ల విద్యార్థుల హాజరు శాతం పెరుగుతుందన్నారు. ఆరోగ్య సమస్యలు గణనీయంగా తగ్గుతాయని కలెక్టర్ల కాన్ఫరెన్స్ సందర్భంగా సిఎం కొనియాడినట్టు వారు గుర్తు చేశారు. రాష్ట్రంలో 79 లక్షల మంది విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని చేరవేయాలన్న లక్ష్యంతో జిల్లాలోని అన్ని అంగన్వాడీలు, పాఠశాలల్లో దీనిని అమలు చేస్తున్నట్టు తెలిపారు. లావేరు మండలం లక్ష్మీపురం అంగన్వాడీ కేంద్రంలోనూ ముస్తా కార్యక్రమం నిర్వహించారు. చిన్నతనం నుంచే పరిశుభ్రతపై మక్కువ పెంచడం ద్వారా చిన్నారులు ఆరోగ్యవంతంగా ఎదుగుతారని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆమోదం లేకుండా పంచాయతీల విభజనా?



అధికారులను నిలదీస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- పోలాకి

పంచాయతీలో ప్రజాప్రతినిధులు తెలియకుండా, తీర్మానం లేకుండా పంచాయతీల విభజన ఎలా చేస్తారని సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ముద్దాడ దమయంతి అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య పాల్గొన్నారు. సందర్భంగా శాఖల వారీగా చర్చిస్తుండగా, కొందరు సర్పంచ్‌లు తమ పంచాయతీలకు అన్యాయం జరిగుతుందని అధికారులను నిలదీశారు. బెలమర పాలవలస పంచాయతీలోని కిల్లిబుచ్చన్నపేటకు మగతపాడు పంచాయతీలోను, జొన్నయ్యపేట గ్రామాన్ని బొద్దాం పంచాయతీలో కలపడానికి ప్రయిత్నిస్తున్నారని అన్నారు. అధికారం అడ్డం పెట్టుకొని అలాచేస్తే ఊరుకునేది లేదని బెలమర సర్పంచ్ ప్రతినిధి రాఘవరావు హెచ్చరించారు. అదేవిధంగా బొద్దాం పంచాయతీని రెండు పంచాయతీలు విభజించడం ఏమిటని, తాను సర్పంచ్‌గా ఉన్నా తనకు తెలియకుండా విభజన చేస్తున్నారని, ఈ విషయంపై కోర్టును ఆశ్రయిస్తామని బి.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు సక్రముగా లేదని, దీంతో రైతులకు అన్యాయం జరిగుతుందని కొందరు ఆరోపించారు. ఇటీవల రహదారి పనులు చేసినా బిల్లు లేవని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏదేమైనా సమావేశం రసాభాసగా కొనసాగింది. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైస్ ఎంపిపిలు కలదండ తాతారావు, కోట అప్పారావు, ఎంపిడిఒ జి.రవికుమార్, డిటి రాజారెడ్డి, ఎఒ సూర్య ప్రకాష్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

'ఉపాధి'ని నిర్వీర్యం చేస్తే ఉద్యమం



బూర్జ : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి- కొత్తూరు

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి ఆ స్థానంలో విబి-జి రామ్ జి చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కొత్తూరులో ప్రజాసంఘాల ఆధ్వర్యాన శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2005లో మహాత్మా గాంధీ పేరుతో వచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి ఆ స్థానంలో కోట్ల మందికి హామీ లేకుండా గ్యారెంటీ అనే అంశాన్ని కాలరాశారని అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ పేరు స్థానంలో విబి-జి రాంజీ జీ పేరుతో తెచ్చిన నూతన చట్టం వల్ల 20 కోట్ల మంది గ్రామీణ పేదలకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుందనిందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టం అమలు అయిన చోట గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనతో పాటు, సామాజిక న్యాయం, ఆర్థిక స్వాతంత్రం, భూస్వామ్య వర్గాలతో బేరమాడే శక్తి పేదలకు కల్పించిందన్నారు. లక్షలాది ఎకరాల పేదల భూమి అభివృద్ధి చెందిందన్నారు. కరోనా సమయంలో దేశమంతా చిన్నాభిన్నమైన గ్రామీణ ఉపాధి హామీ చట్టం కోట్లాది మందికి ఉపాధి చూపించి అన్నం పెట్టిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిందని తెలిపారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన చట్టాన్ని మరింత బలోపేతం చేయాల్సింది పోయి ఆ చట్టంలోని కీలకమైన అంశాలు గ్యారెంటీ 90:10ని రద్దుచేసి రాష్ట్రాలకు భారం పడేలా 40 శాతం నిధులు ఖర్చు పెట్టాలని సూచించడం సరికాదన్నారు. 73, 74 పంచాయతీరాజ్ చట్టానికి విరుద్ధంగా స్థానిక సంస్థలకు అధికారాలు లేకుండా పని హక్కును కాలరాస్తూ విబి-జి రాంజీ జి చట్టం చేయడం కోట్లాదిమంది పేదలకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు కన్వీనర్ పనస రమేష్, రైతు సంఘం కన్వీనర్ వి.రాములు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి.తెల్లన్న, కలోడియా వెంకటరావు, రామారావు, బసవల వసంతరావు, మోహన్ పాల్గొన్నారు.

బూర్జ : జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు గంగరాపు సింహాచలం అన్నారు. మండలంలోని జంగాలపాడు పంచాయతీ పరిధిలో ఉన్న అడ్డూరిపేట, మశానపుట్టి గ్రామాల్లో గిరిజనులతో మాట్లాడారు. కూలీలకు ఏడాదిలో 200 రోజులు పనిలో దినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా మసనపుట్టి గ్రామంలో జిఒ ప్రతులను, కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కల్లేపల్లి సూర్యనారాయణ, రమణ, మోహనరావు, ముద్ద గన్నయ్యతో పాటు మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కొత్తూరు : నిరసన తెలుపుతున్న కూలీలు

వజ్రపుకొత్తూరు : కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి, ఒక పథకంగా మార్చి కోట్లాదిమంది వ్యవసాయ కూలీల బతుకు తెరువు లేకుండా చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.ఆనందరావు అన్నారు. మండలంలోని గుల్లలపాడులో ఉపాధి కూలిలతో కలిసి మౌని దీక్ష పాటించి నిరసన తెలిపారు. ఈ దీక్షకు బి.రామకృష్ణ, రైతు సంఘం నాయకులు ఎన్.మోహనరావు, సిఐటియు నాయకులు సంఘీభావం తెలిపారు. గ్రామీణ పేదల సంఘం నాయకులు ఎన్.చంద్రయ్య, సిస్టు కృష్ణారావు, పి.లక్ష్మీనారాయణ, పి.గోవిందరావు, సంతోష్, చింతాడ బాలకృష్ణ, సిస్టు రామ్మూర్తి పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు : మౌనదీక్ష చేస్తున్న కూలీలు

టెక్కలి రూరల్ : ఉపాధి హామీ పనులు నిర్వీర్యం చేస్తే ఊరుకోమంటూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గాంధీ విగ్రహం ముందు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కొల్లి ఎల్లయ్య, సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, హెచ్.ఈశ్వరరావు, యు.లక్ష్మణరావు, బి.ధర్మారావు, సరస్వతి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస : అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర పియుసి చైర్మన్ ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని అక్కివరం, తోటాడ గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో రూ.3.86 కోట్లతో సిసి రహదారి, కాలువల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. అలాగే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌శాఖ నిధులు ఎన్‌హెచ్‌ఎం గ్రాంట్ నిధులతో రూ.10.29 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఐసిడియస్ సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం అందించిన 5జి మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్కివరంలో ఏర్పాటు చేసిన స్వామిత్వ అవగాహన సదస్సులో పాల్గొన్నారు.కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, నారాయణపురం ఆనకట్టు చైర్మన్ సనపల ఢిల్లేశ్వరరావు, దూసి నీటి సంఘం అధ్యక్షులు హనుమంతు బాలకృష్ణ, టిడిపి నాయకులు నూక రాజు, తాండ్ర హరి, బెండి రామ్మోహన్, కూన అమ్మాజీ, పొన్నాడ గణపతి, తమ్మినేని అప్పలనాయుడు, కోట శ్రీను, ఎండ అప్పలనాయుడు, అన్నెపు భాస్కరరావు, బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, గొండు రమణ, గురుగుబెల్లి నీలారావు బెండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

బాగుంటే 'బాబు' మహిమ



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

'మీరు బాగా పనిచేశామని అనుకుంటున్నారు.. నేను కూడా అదే అనుకుంటున్నా.. కానీ, ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు.. మీ పని తీరును ప్రజలు మెచ్చడం లేదు... ఎక్కడో ఏదో లోపం ఉంది.. అదేమిటో గుర్తించండి.. లోపాలు సరిదిద్దుకుని జాగ్రత్తగా పని చేయండి..' ఇదీ ఇదీ ఇటీవల కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు. అడ్డంకులు తొలగించి పరిపాలను పరుగులు పెట్టించాలే మీరే అడ్డంకిగా మారకూడదు. లోపాలన్నీ ప్రభుత్వం దగర్గ పెట్టుకుని చాలా చక్కగా ఆ వైఫల్యాలను కలెక్టర్ల మీదకు నెట్టేయడంలో ఆయనకు ఆయనే సాటే. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా.. ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. పింఛన్ల పరిస్థితి కూడా అలానే ఉంది. స్పౌజ్ పింఛన్లు తప్ప కొత్తగా ఒక్కరికీ ఇచ్చిన పాపాన పోలేదు. దీంతో ఆయా తరగతుల్లో ప్రభుత్వ పట్ల తీవ్ర అసంతృప్తి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధ్యాయ పోస్టుల తప్ప ఇతర శాఖల నుంచి ఉద్యోగాల భర్తీయే లేదు. ఏటా జనవరిలో జాబ్ కేలండర్ విడుదల చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి పెద్దలు మూడో జనవరి వచ్చేస్తున్నా కేలండర్‌కు అతీగతీలేకుండా పోవడంతో ప్రభుత్వంపై యువతలో తీవ్ర అసహనం నెలకొంది. పైగా ప్రభుత్వ మద్యం దుకాణాలు, వలంటీర్లు, రేషన్ వాహనాల ఆపరేటర్లను తొలగించి ఉన్న ఉపాధిని ఊడగొట్టింది. రైతులకు అన్నదాత ఇచ్చాం వారంతా ప్రభుత్వంపై సానుకూలతతో ఉన్నారని ప్రభుత్వం సంబరపడిపోతున్నా క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వం చేపట్టిన భూ సమగ్ర సర్వేలో చోటు చేసుకున్న తప్పిదాలతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. వెబ్‌ల్యాండ్‌లో తమ భూములు వేరే వ్యక్తుల పేరు మీద కనిపిస్తుండటం, సర్వే నంబర్లు మారిపోవడం, జాయింట్ ఎల్‌పిఎం వంటి సమస్యలు పరిష్కారం కాక గ్రీవెన్స్, రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతూ విసిగెత్తిపోతున్నారు. భూ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన టిడిపి కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వాన్ని నిందిస్తూ కాలక్షేపం చేస్తుందన్న భావన రైతుల్లో నెలకొంది. కార్మికులకూ నష్టం కలిగించేలా టిడిపి కూటమి ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు తీసుకుంది. పరిశ్రమల్లో కార్మికుల పనిగంటలను ఎనిమిది నుంచి 12 గంటలకు పెంచడంపై వారిలోనూ వ్యతిరేకత నెలకొంది.

టిడిపి కూటమి ప్రభుత్వం విధానాలతో అన్ని తరగతుల్లోనూ అసంతృప్తి నెలకొంటే ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని కలెక్టర్ల పని తీరుకు లింకు పెట్టేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాలో పెద్దగా జరిగిన అభివృద్ధి కూడా ఏమీ కనిపించడం లేదు. ఉత్తరాంధ్ర ఉద్ధరిస్తామంటూ మాటల్లో చెప్తూ రాయలసీమకు వేల కోట్ల రూపాయలను కుమ్మరిస్తోంది. వంశధార ప్రాజెక్టు స్టేజ్-2 పేజ్-2కు రూ.276 కోట్లు ఇస్తే పూర్తయ్యే పరిస్థితి ఉండగా ఒక్క పైసా కూడా విడుదల చేయడం లేదు. గొట్టాబ్యారేజీ వద్ద నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకానికి రూ.172 కోట్లు ఇస్తే హిరమండలం రిజర్వాయరులో 12 టిఎంసిల నీళ్లను నింపుకోవచ్చు. దానికీ డబ్బులు విదల్చడం లేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అటు ఆఫ్‌షోర్ రిజర్వాయరు, హైలెవెల్ కెనాల్ పనులు ముందుకు సాగని పరిస్థితి ఉంది. టిడిపి నేతలపై వైసిపి ప్రభుత్వం పెట్టిన కేసులను తొలగిస్తున్న కూటమి ప్రభుత్వం షట్టర్ల అవినీతిపై పెండింగ్‌లో ఉన్న కేసును పరిష్కరించడంపై దృష్టి సారించకపోవడంతో శివారు భూములకు సాగునీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం నిధులు ఇస్తే కదా అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల పనులను ఎవరైనా పరుగులు పెట్టించగలరు. ప్రభుత్వం పైసా విదల్చకుండా కలెక్టర్లు ఏదో అభివృద్ధికి అడ్డంకిగా ఉన్నట్టు మాట్లాడటం బాబుకే చెల్లింది.

పరిశ్రమలు, పెట్టుబడులు అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న చంద్రబాబు ఏడాదిన్నర పాలనలో వెనుకబడిన జిల్లాగా ఉన్న శ్రీకాకుళానికి ఒక్క పరిశ్రమ ఇవ్వలేదు. జిల్లాలో పరిశ్రమలు తీసుకొచ్చి జిల్లా వాసులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా వారే జిల్లాకు వచ్చేలా చేస్తామని మాటలు చెప్పి అవకాశం వచ్చినప్పుడే ఏ అమరావతిలోనో, విశాఖలోనో ఏర్పాటుకు ఒప్పందాలు చేసుకుంటున్న పరిస్థితిని గమనిస్తున్న ప్రజలు అసహనంతో ఉన్నారు. ప్రజలకు ,రైతులకు నష్టం తీసుకొచ్చే పోర్టులు, ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేసి జిల్లా అభివృద్ధి కోసమే అంటూ నమ్మబలుకుతున్నారు. ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా కార్పొరేట్ల కోసం బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. ఇది టిడిపి కూటమి ప్రభుత్వ తీరుపై ప్రతికూల ప్రభావం కనబరుస్తోంది. ప్రజా వ్యతిరేకత ఎలా ఉన్నా వారి భూములు తీసుకుంటే కలెక్టర్ల పనితీరు సంతృప్తికరంగా ఉన్నట్టు సిఎం చంద్రబాబు భావిస్తున్నట్టుగా కనిపిస్తోంది.

అధికార పార్టీ ఎమ్మెల్యేల పని తీరూ ప్రజల సంతృప్తికి ఒక ఫ్యాక్టర్‌గా ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలో అందరి పరిస్థితీ ఒకేలా ఉంది. గెలిచిన ఎమ్మెల్యేలు సామాంతురాజు, సంస్థానాధీశులుగా చలామణి అవుతున్నారు. పరిపాలనలో తీవ్ర రాజకీయ జోక్యం పెరిగింది. ఎవరి స్థాయిలో వారు అధికారులను శాసిస్తున్నారు. అధికార యంత్రాంగంపై ఒత్తిడి చేసి జిఒలు, నిబంధనలను తోసిరాజని అడ్డగోలుగా పనిచేయించుకుంటున్నారు. తాము చెప్పిన పని నెరవేరకపోయినా, తమను నెలనెలా కలవకపోయినా రాష్ట్ర స్థాయిలో చక్రం తిప్పి ఉన్నపళంగా అధికారులను బదిలీ చేసేస్తున్నారు. తమ నియోజకవర్గంలో ఇసుక రీచ్‌లు ఉంటే వాటిని తమ కనుసన్నల్లోనే సాగుతుంది.



ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టియు నాయకులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రిమ్స్ పారిశుధ్య కార్మికుల కాంట్రాక్టర్ క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీస్ లిమిటెడ్ యాజమాన్యం శ్రమ దోపిడీ చేయడమే కాకుండా తీవ్రమైన వేధింపులకు గురిచేస్తున్నారని రిమ్స్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొప్పల రాజశేఖర్ తీవ్రంగా ఖండించారు. శనివారం రిమ్స్ ఆస్పత్రి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. జిఒ ప్రకారం వేతనాలు అడిగినందుకు, క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీస్ లిమిటెడ్ యాజమాన్యం తయారు చేసిన పేపర్లపై సంతకాలు పెట్టని ఐఎఫ్‌టియు యూనియన్‌లో 40 మంది పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, నిత్యం వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, డిప్యూటీ కమిషనర్ లేబర్, రిమ్స్ అధికారులకు, సర్వజనాస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే గొండు శంకర్‌కు వినతిపత్రాలు అందించామన్నారు. తక్షణమే ప్రిన్సిపాల్ ఎంప్లాయర్‌గా ఉన్న రిమ్స్ అధికారులు పారిశుధ్య కార్మికులపై దయ చూపాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు దమ్ము చిన్నారావు, కోశాధికారి సాధు శ్రీనివాస్, కొప్పల భాస్కరరావు, సహాయ కార్యదర్శి కోర్లకోట విజయ తదితరులు పాల్గొన్నారు.

నేడు జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- రణస్థలం

మాజీ సిఎం, వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే, వైసిపి ఇన్‌ఛార్జి గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మెగా రక్తదాన శిబిరం, ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయడం, పేదవారికి బట్టలు పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, వివిధ విభాగాల అధ్యక్షులు, అభిమానులు, సోషల్ మీడియా కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పలాస : వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఆదివారం ప్రగతి భవనం వద్ద ఘనంగా నిర్వహించనున్నమని, ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పలాసలోని వైసిపి కార్యాలయం ప్రగతి భవన్ వద్ద మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నేతృత్వంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

గర్భిణులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక ఎన్‌టిఆర్ భవనంలో అంగన్వాడీ వర్కర్లకు 5జి స్మార్ట్ ఫోన్లను శనివారం అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు నమ్మకం, విశ్వాసంతో తమ చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలకు పంపిస్తున్నారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనం, పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అంగన్వాడీ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. కార్పొరేట్ స్థాయికి ధీటుగా చిన్నారులకు విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల మరోసారి జాతీయ స్థాయిలో తన ప్రతిభను నిరూపించుకుంది. కళాశాలలో ఏర్పాటు చేసిన ఐతం రైజ్ ఇన్క్యుబేటర్‌లో అభివృద్ధి చెందిన ఒక విద్యార్థి స్టార్టప్, హైదరాబాద్‌లో డిసెంబరు 15 నుంచి 19 వరకు నిర్వహించిన 'ఆక్వా యూరేకా-2025' జాతీయ స్థాయి ఆవిష్కరణ, వ్యాపార ప్రణాళిక పోటీలో, దేశవ్యాప్తంగా పాల్గొన్న 60 జట్లను అధిగమించి తొలి బహుమతిని కైవసం చేసుకున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్య, జలకృషి రంగాల్లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక పోటీలో ఐతం రైజ్ ఇన్క్యుబేటర్‌కు చెందిన 'ఆక్వాగ్రో' అనే విద్యార్థి స్టార్టప్ తమ వినూత్న ఆలోచనలు, ఆధునిక సాంకేతిక పరిష్కారాలు, స్పష్టమైన వ్యాపార నమూనాతో న్యాయనిర్ణేతలను విశేషంగా ఆకట్టుకుని మొదటి స్థానాన్ని దక్కించుకుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, హెచ్ఒడిలు అధ్యాపకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రం, జె.ఆర్.పురం పంచాయతీ, వెంకటేశ్వర కాలనీలో సాక్షి విలేకరి గంగి నాగరాజు తండ్రి గంగి గోపి ఇటీవల మరణించారు. విషయం తెలుసుకొని శనివారం వారి స్వగృహంలో ఆయన కుటుంబ సభ్యులను ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పరామర్శించారు. అలాగే సాక్షి డెస్క్ ఇన్‌ఛార్జ్ రాజా, సాక్షి ఎచ్చెర్ల రిపోర్టర్ రామారావు తదితరులు పరామర్శించి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు, డోల వెంకట రమణ, ఎచ్చెర్ల నియోజకవర్గ చేతివృత్తుల విభాగం అధ్యక్షులు టేకు లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ కరిమజ్జి భాస్కరరావు, ఉప సర్పంచ్ దన్నాన సీతారాం తదితరులు పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని ఆదపాక, గుర్రలాపాళెం గ్రామాలకు చెందిన వైసిపి కార్యకర్త గొర్లె సత్యం కుమారుడు గొర్లె శ్రీరాములు ఇటీవల మరణించడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్ ఆయన కుటుంబసభ్యులును పరామర్శించి సంతాపాన్ని తెలిపారు అలాగే గుర్రాలపాళెం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త బాధా వెంకటరమణ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఆయన వెంట వైసిపి మండల అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు, మాజీ సర్పంచ్ నడిమింటి కుమారి, ఎంపిటిసిలు గంట్యాడ సత్యం, జనపాల బానోజీరావు, కిల్లరి మధు, గంట్యాడ చిన్న, సూర్యనారాయణ, అల్లంపల్లి గోవిందరావు, సతీష్, మహేష్, రాము తదితరులున్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ఇచ్ఛాపురం: స్థానిక విజె ఫంక్షన్ హాల్‌లో జెసిఐ సంస్థ ఆధ్వర్యాన సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా సాధారణ, ఎముకులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఫార్మా లిమిటెడ్, విఆఎస్ మెడికల్ సహకారంతో వైద్యులు వెచ్చ సంతోష్ 156 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి నిర్వహించారు. కార్యక్రమంలో జెసిఐ అధ్యక్షులు కాళ్ల జైదేవ్, ఎలెక్ట్ అధ్యక్షులు బోయిన శ్రవణ్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించాలి

కవిటి: తరగతి గదిలో దిగువ శ్రేణి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించాలని ఎంఇఒలు ధనుంజయ మజ్జి, సనపల రామకృష్ణ సూచించారు. శనివారం రెండో పూట మండలంలోని ఆరు పాఠశాలల్లో క్లస్టర్ కాంప్లెక్స్ నిర్వహించారు. అందులో భాగంగా ఎంఇఒలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు టిఎల్ఎం మెటీరియల్ తయారుచేసి సమయానికి సిలబస్ పూర్తిచేసేలా ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. టూల్ 1, టూల్ 3 విద్యార్థులతో చేయించాలని చెప్పారు. అనంతరం ఎఫ్ఎల్ఎన్ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, డిఆర్‌పిలు జి.జానకిరావు, బి.లక్ష్మణమూర్తి, సిఆర్‌పి తులసి పాల్గొన్నారు.

మెప్మా తీరుపై విప్ ఆగ్రహం

ప్రజాశక్తి- కవిటి

కేవలం రుణాలు ఇచ్చి వసూలు చేయడమే మెప్మా లక్ష్యమైతే, ప్రతి కుటుంబం నుంచీ పారిశ్రామికవేత్త ఎప్పుడు తయారవుతారని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ప్రశ్నించారు. తన క్యాంపు కార్యాలయంలో మెప్మా సిబ్బంది, సిఒలు, ఆర్‌పిలతో శనివారం సమీక్షించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో సుమారు 820 సంఘాలు, 8,500 కుటుంబాలు మెప్మా పరిధిలో ఉన్నాయని గుర్తుచేశారు. మంజూరైన రుణాలు ఎలా వినియోగిస్తున్నారన్న దానిపై పర్యవేక్షణ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో వనరులు ఉన్నాయని, అదనపు ఆదాయం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు ఆదాయం పెంపొందించే దిశగా సభ్యులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. స్థానిక వనరులు ఉపయోగించి కొత్త ఉత్పత్తులు తయారుచేయాలని సూచించారు.

అవకతవకలపై...

కొంతమంది సభ్యుల వద్ద సిబ్బంది అదనపు వడ్డీలు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇది


మెప్మా అధికారులను ప్రశ్నిస్తున్న విప్ అశోక్

సరికాదని హెచ్చరిస్తూ, ఇకపై ఇలాంటి చర్యలు సహించబోమన్నారు. అలాగే 17వ వార్డులో రూ.7 లక్షల గోల్‌మాల్ జరిగి రెండేళ్లు గడిచినా చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే లిఖితపూర్వక ఫిర్యాదు చేసి, దోచుకున్న సొమ్మును వసూలు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా మెప్మా సిబ్బంది ఇకపై పూర్తిస్థాయి పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించాలని హెచ్చరించారు. సమావేశంలో మెప్మా పీడీ ఎస్.వెంకటరావు, ఐబి బి.రాము, ఎల్.హెచ్.కిషోర్‌బాబు, టిఎంసి బి.భాస్కరరావు పాల్గొన్నారు.

వైద్య విద్యకు పెద్దపీట

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

పార్టీలకతీతంగా ప్రజలకు సేవలందించాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి మండలం ఎన్‌టిఆర్ భవన్ వద్ద శనివారం సిఎం సహాయనిధి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఇందులో భాగంగా 37 మంది లబ్ధిదారులకు రూ.25,44,580 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత టెక్కలి నియోజకవర్గస్థాయిలో 237 మంది సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా, 194 మందికి రూ.2.26 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యంపై పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. వైద్య ఖర్చులు భారమై ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న వారి జీవితాల్లో ముఖ్య మంత్రి సహాయనిధి వెలుగులు నింపుతుందని అన్నారు. కార్యక్రమం పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్ పాల్గొన్నారు.


సిఎం సహాయనిధి అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

మండలంలోని 75 మంది దరఖాస్తు చేసుకోగా, 61 మందికి మంజూరయ్యాయని తెలిపారు. వీరందరికీ చెక్కు రూపంలో రూ.67,51,975 అందజేశామన్నారు. సంతబొమ్మాళి నుంచి 85 సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా, 69 మంది లబ్ధిదారుకు రూ.93,1837 పంపిణీ చేశామన్నారు. టెక్కలి మండలం నుంచి 34 దరఖాస్తు చేసుకోగా, 27 మందికి రూ.28,92,178, నందిగాం 43 మంది దరఖాస్తు చేసుకోగా, 37 మంది రూ.36,90,431 పంపిణీ చేశామన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి స్థానిక ఏడురోడ్ల కూడలి వరకు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఆర్. రామదాసు ఆధ్వర్యంలో పల్స్‌పోలియో ర్యాలీ శనివారం నిర్వహించారు. ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.అనిత జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివారం జరగనున్న పోలియో నిర్మూలనా కార్యక్రమాన్ని జిల్లా ప్రజలందరూ విజయవంతం చేయాలని కోరారు. 0 నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలందరికి పోలియోచుక్కలు వేస్తామని, ఈ కార్యక్రమంపై జిల్లా పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, వైద్యసిబ్బంది విస్తృత ప్రచారం చేసి శతశాతం లక్ష్యం సాధించేలా కృషి చేయాలన్నారు. మొబైల్ టీమ్‌లు, ప్రత్యేక బృందాలు ఏర్పడి అన్ని సంచారజాతుల పిల్లలకు, ఇటుకబట్టీలు, గృహనిర్మాణ స్థలమునందు నివసించు, పండ్లతోటల్లో ఉంటున్న పిల్లలకు, మత్స్యకారుల పిల్లలందరికి శతశాతం పోలియోచుక్కలు వేసి జిల్లాను పోలియోరహిత జిల్లాగా తీర్చిదిద్దాలని సూచించారు. వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, పంచాయతీరాజ్ సిబ్బంది, ఉపాధ్యాయులు అందరూ క్షేత్రస్థాయిలో పాల్గొని ఈ కార్యక్రమం విజయంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ మేరీ కేథరిన్, డిపిఎంఒ డాక్టర్ బి.రవీంధ్ర, జిల్లా అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఆర్.బాబురావు, సంఘసేవకులు మంత్రి వెంకటస్వామి, హెచ్ఇఒ బి.ముఖలింగం, డిప్యూటీ డెమో కె. యర్రన్న, డిప్యూటీ హెచ్ఇఒ ఎస్.విజయలక్ష్మి, పి.మోహిని, రెడ్‌క్రాస్ సిబ్బంది పెంకి చైతన్య, సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కవిటి: నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు అంటూ కవిటిలోని కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు శనివారం పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.


శ్రీకాకుళం సిటీ : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

డిసెంబరు 21న దేశవ్యాప్తంగా నిర్వమించిన పోలియో నిర్మూలన కార్యక్రమానికి మద్దతుగా ఈ ర్యాలీ నిర్వహించినట్లు పాఠశాల ఎఒ రాణి తెలిపారు. కవిటి పురవీధుల మీదుగా నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు పోలియో చుక్కల ప్రాధాన్యతపై నినాదాలు చేశారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జరిభద్రలో విషాదం


సింహాచలం (ఫైల్)

మెళియాపుట్టి : మండలంలోని జరిభద్రకు చెందిన దుంపల సింహాచలం గుండెపోటుతో మృతి చెందారు. ప్రస్తుతం విజయవాడలో ట్రెజరీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు శనివారం ఉదయం అకస్మాత్తుగా అస్వస్థత గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. సింహాచలం స్వస్థలం జరిభద్ర గ్రామం. ప్రభుత్వ సేవలో నిబద్ధతతో పనిచేసిన అధికారిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. ఆయనకు భార్య మణికుమారి, ఇద్దరు కుమారులు సాయి, సుశాంత్ ఉన్నారు. సింహాచలం తండ్రి దుంపల కామయ్య గతంలో సర్పంచ్‌గా విధులు నిర్వహించారు. కుటుంబానికి గ్రామంలో మంచి పేరు ఉండడంతో సింహాచలం మృతితో జరిభద్ర గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఈ నెల 21న నిర్వహిస్తున్నట్టు వైసిపి టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఉదయం 9.30 గంటలకు టెక్కలి జిల్లా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రగ్గులు పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. 11:30 గంటలకు 'జగనన్న జన్మదిన వేడుకలు కేకు కటింగ్ ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. శ్రేణులు, అభిమానులు విజయవంతం చేయాలన్నారు.


బహుమతి అందుకుంటున్న కాత్యాయని

స్పెల్ బిలో కాత్యాయిని ప్రతిభ

ప్రజాశక్తి- కవిటి

మండల స్థాయి స్పెల్ బీ పోటీల్లో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని కాత్యాయని వరప్రసన్న ప్రతిభ చాటింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కవిటిలో నిర్వహించిన మండల స్థాయి స్పెల్ బీ పోటీల్లో పదో తరగతి చదువుతున్న కాత్యాయని వరప్రసన్న ప్రథమ స్థానం సాధించి జిల్లాస్థాయి స్పెల్ బి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.విశ్వనాథం విద్యార్థిని అభినందిస్తూ జ్ఞాపికను అందజేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆంగ్ల భాషలోనూ ప్రతిభ చూపడం అభినందనీయమని అన్నారు. పాఠశాల సిబ్బంది విద్యార్థి ప్రతిభను కొనియాడారు.


మిల్లు వద్ద ధాన్యంతో నిలిచిన ట్రాక్టర్లు

కొర్రీల క్యూ

బూర్జ: మిల్లర్లు అధికారుల నిర్లక్ష్యంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బ్యాంకు గ్యారంటీలు తియ్యకుండా మిల్లు ఆడితే బియ్యం ముక్కలవుతున్నాయని కారణాలు చూపించి కొనుగోలులో నిర్లక్ష్యం చేస్తున్నారు. మిల్లుల వద్దకు తీసుకువెళ్లిన ధాన్యాన్ని తీసుకోవడానికి కొర్రీలు పెట్టి ముప్పతిప్పులు పెడుతున్నారు. బూర్జ మండలం డొంకల పర్త గ్రామ సమీపంలో శ్రీ అయ్యప్ప రైస్ మిల్లు, తోటవాడ గ్రామంలోని వెంకటరమణ రైస్‌మిల్ సమీపంలో శనివారం ట్రాక్టర్ లోడ్లు ఇలా నిలిచి పోయాయి.

22 నుంచి స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఈ నెల 22 నుంచి 24 వరకు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అంతర పాలిటెక్నిక్ క్రీడలు, ఆటలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. కళాశాలలో క్రీడలు పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. సాంకేతిక విద్యాశాఖ ఈ క్రీడలు పర్యవేక్షిస్తుందన్నారు. క్రీడల్లో పాల్గొని విద్యార్థులు విజయవంతం చేయాలన్నారు. ప్రారంభ, ముగింపు వేడుకులకు పలువురు ప్రముఖులు హాజరు కానున్నారని చెప్పారు.

జూనియర్ కళాశాలలో 'ముస్తాబు'

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా చేపట్టిన ముస్తాబు కార్యక్రమం శనివారం నిర్వహించారు. విద్యార్థులకు అనునిత్యం శుభ్రపరచుకోవడం, గోళ్లను కత్తిరించుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం కలిగే లాభాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ సుష్మ తెలిపారు. విద్యార్థులు పరిశుభ్రంగా ఉంటేనే మనసు ప్రశాంతంగా ఉంటుందని తద్వారా ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ ఠాగూర్, కళాశాల ఇన్‌ఛార్జి శశిధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాష్ట్ర ప్రభుత్వం ఆకాంక్షిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర దిశగా గ్రామాల వికాసమే లక్ష్యంగా విద్యార్థులు కృషి చేయాలని ఆర్‌జియుకెటి (ఐఐఐటీ) శ్రీకాకుళం ప్రాంగణ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయ జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం శనివారం ఐదవరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎచ్చెర్లలోని తహశీల్దారు కార్యాలయం, ప్రభుత్వ ఆస్పత్రి, ఎంపిడిఒ కార్యాలయ పరిసరాల్లో డైరెక్టర్ పర్యవేక్షణలో విద్యార్థులు శ్రమదానం నిర్వహించి చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో యువత సైబర్ నేరాలు, లోన్ యాప్స్‌పై


మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

శ్రమదానంతోనే స్వచ్ఛత సాధ్యం

అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా స్కామర్ల ఉచ్చులో పడకుండా తోటివారిని చైతన్యపరచాలని సూచించారు. శిబిరంలో భాగంగా ఎస్.ఎం.పురంలో వెటర్నరీ డాక్టర్ జి.సురేష్, ఐఐఐటి డీన్ డాక్టర్ శివరామకృష్ణతో కలిసి వాలంటీర్లు మొక్కలు నాటారు. బురిడి కంచరాం గ్రామంలో పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించగా కేశవరావు పేట, ఎస్.ఎస్.ఆర్. పురంలో అంగన్వాడీ, పాఠశాల విద్యార్థులకు యోగా, ధ్యానం, క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అలాగే 104 సేవలు, సచివాలయ పరిధిలోని ఆరోగ్య సదుపాయాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి డా.ముని రామకృష్ణ, డీన్ డా.శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డా.వాసు, వెల్ఫేర్ డీన్ డా.రవి గేదెల, ఎన్.ఎస్.ఎస్ కో-ఆర్డినేటర్ ముకుందరావు, డా.వి.సింహాచలం, డా.బి.శ్రీధర్, పి.గాయత్రి, టి.అసిరినాయుడు, ఆర్.పద్మావతి పాల్గొన్నారు.


పోస్టర్ అవిష్కరిస్తున్న డిఎస్ఒ, సిబ్బంది

వినియోగదారుల హక్కులు కీలకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

వినియోగదారుల హక్కులు కీలకమని డిఎస్ఒ సూర్యప్రకాశరావు అన్నారు. ఈ నెల 24న వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా పౌరసరఫరా శాఖ అధికారి కార్యాలయంలో శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రజల్లో హక్కులపై అవగాహన అవసరమన్నారు. అశ్రా అధ్యక్షులు ఎజ్రా పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని మబగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. శుభ్రతపై ప్రతి ఒక్కరిలోనూ మార్పు రావాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం సమన్వయకర్త బగ్గు అర్చన, టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పిఎసిఎస్ ఛైర్మన్ భైరి భాస్కరరావు, కాయ రవి, ఎంపిడిఒ జి.రవికుమార్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా కమిషనర్ రమేష్ ఆధ్వర్యాన తడి, పొడి చెత్త విభజనపై పరిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్, సచివాలయ పర్యావరణ సెక్రటరీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పెద్దలక్ష్మీపురంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్రా కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహన్‌రావు, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు గౌడ్, కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు. ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా,


ఇచ్ఛాపురం : ప్రతిజ్ఞ చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఎంపిడిఒలు ఎస్.దేవేంద్రరావు, ఎం.పద్మనాభరావు, బూర్ల లలితకుమారి, బసవ పరమేనాయకులుష్‌రెడ్డి, గిరిజన నాయకులు బైర్సింగ్ దినకర్, సిలార్, ఎపిఒ రవి, బస్వ పరమేశ్వరరెడ్డి, కార్యదర్శి డి.వాసుదేవరావు, పిఆర్ఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

నరసన్నపేట: ప్రతిఒక్కరూ పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపిడిఒ వెంకటేశ్వరప్రసాద్ సూచించారు. స్థానిక కార్యాలయ ఆవరణలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రతినిధులు

అప్‌హోల్డ్ ఆధ్వర్యాన అవగాహన

ప్రజ్శాక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం జిల్లాలోని అప్‌హోల్డ్ నగర్‌లో ఉన్న కరుణ సమాజం వాసుల కోసం అప్‌హోల్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సామర్థ్య వృద్ధి, అవగాహన కార్యక్రమాలు డిసెంబరు 19, 20 తేదీల్లో విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో భాగంగా కుష్టువ్యాధితో ప్రభావితులైన వ్యక్తులకు సంబంధించిన హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అర్హతలు, న్యాయ పరిరక్షణ అంశాలపై నిపుణులైన వనరుల వ్యక్తులు విస్తృతంగా అవగాహన కల్పించారు. సమాజంలో ఎదురయ్యే వివక్షను అధిగమించడం, స్వావలంభన సాధించడం, అలాగే సమాన హక్కులతో జీవించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వివరించారు. నివాసితులు తమ హక్కులను తెలుసుకుని, ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ద్వారా అందుబాటులో ఉన్న సదుపాయాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సాహం లభించిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కుష్ఠు ప్రభావితుల సంక్షేమం, సామాజిక గౌరవం, ప్రధాన సమాజంలో వారి సమగ్ర అభివృద్ధి కోసం అవగాహన కార్యక్రమాలను భవిష్యత్‌లో కూడా కొనసాగిస్తుందన్నారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఎచ్చెర్ల: మండలంలోని స్థానిక చిలకపాలెం శ్రీ శివాని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆవరణలో శనివారం ఇంధన పొదుపు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్ ఎక్స్‌పోలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, విద్యుత్ శక్తిని పొదుపు చేసుకోడానికి చేసిన

ఘనంగా ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రాజెక్ట్‌లు ఆకర్షనీయంగా ఉన్నాయని, వీటిని మరింత వృద్ధి చేసుకునేలా చూడాలన్నారు. విద్యార్థులు నిత్యజీవితంలో గహోపకరణాలకు వాడే విద్యుత్ శక్తి, దుర్వినియోగం, ఆదా చేసే మార్గాలు, పిఎం మోడీ సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించారు. ఎలక్ట్రికల్ విభాగాధిపతి ఎం.సాయి సుధ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.టి చంద్రశేఖర్, డిప్లొమా ప్రిన్సిపాల్ ఎస్‌విఎన్ సునీల్ కుమార్, వివిధ విభాగాధిపతులు డాక్టర్ వి.సూర్యనారాయణ, డాక్టర్ ఎస్.లక్ష్మణ రాజు, డాక్టర్ పి.రేవంత్ కుమార్, కె.మధు కుమార్, కె.రవికుమార్, వై. జగదీష్ కుమార్, పి.ప్రదీప్, టిపిఒ డాక్టర్ బి.ప్రసాదరావు, పీడీ టి. బాలాజీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు.

టిడిపి అభివృద్ధికి కృషి

బూర్జ: టిడిపి బలోపేతానికి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని టిడిపి జిల్లా అధ్యక్షుడు మొదలవలస రమేష్ అన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షుడిగా రమేష్ నియమతులు కావడంతో బూర్జ మండలానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, నీటి సంఘం అధ్యక్షులు బెజ్జిపురం స్వామినాయుడుతో పాటు కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు టిడిపి బలోపేతానికి మరింతగా కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. అలాగే కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఉచిత గ్యాస్ పంపిణీ

మెళియాపుట్టి: మెళియాపుట్టి మండల కేంద్రంలో శనివారం ఉజ్వల పథకం కింద 72 మంది లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ పొయ్యిలను కూటమి నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సలాన రాఘవరావు, దుక్క బాలరాజు, రవ్వల గణపతిరావు, సలాన అప్పలనాయుడు, రమేష్, భూపతిరావు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

కవిటి: జాడుపూడి వయా సహలల పుట్టుగ, దూగానపుట్టుగ, బి.గొనపపుట్టుగ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని దూగానపుట్టుగ కూటమి నాయకులు ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్‌ను కోరారు. ప్రజల 30 ఏళ్ల నాటి కలను నెరవేర్చేందుకు తక్షణమే స్పందించిన విప్ అశోక్ పలాస ఆర్‌టిసి రీజనల్ మేనేజర్‌ను సంప్రదించి బస్సు సౌకర్యం కల్పించాలని సూచించారు. ఈ మేరకు కూటమి నాయకులు పలాస ఆర్‌టిసి రీజనల్ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలో బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యుడు దూగాన దివాకర్, ప్యాక్స్ సభ్యుడు బోగియా రాజశేఖర్, నాయకులు సాగర్, సిసింద్రి, హేమచలపతి, మనోజ్, భాస్కర్, లోకేష్, సురేష్ పాల్గొన్నారు.

దామోదర్ సాగర్ పరిశీలన

మందస: మండలంలోని దామోదర్ సాగర్‌ను ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. దామోదర్ సాగర్ ప్రాజెక్టు కాలవలు, ఇతరత్రా కొన్ని పనులు పెండింగ్ ఉన్న కారణంగా పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందక ఆ ప్రాంత రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. దీంతో ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సుమారు రూ.5 కోట్లు నిధులు మంజూరు ఆమోదించారు. ప్రాజెక్టు ఆధునీకరణకు టెండర్ పిలిచేందుకు ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ పీరుకట్ల విఠల్‌రావు, ఎఎంసి ఛైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, పిఎసి ఛైర్మన్ తమరి భాస్కరరావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలం బొరివంక సబ్‌స్టేషన్ పరిధిలోని 11కెవి ఫీడర్‌లో ఆర్‌డిఎస్ఎస్ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. బెజ్జిపుట్టుగ, బొరివంక గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు సరఫరాలో అంతరాయం ఏర్పడు తుందన్నారు.


దుస్తులను అందజేస్తున్న అన్వేష్

దుస్తుల పంపిణీ

ఇచ్ఛాపురం: క్రిస్టియన్ పండగ, మాజీ సిఎం జగన్ జన్మదినం పురస్కరించుకొని ఆశ్రమంలో పేదలకు వనివారం దుస్తులు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బిషప్ కొత్తపల్లి అబ్రహం, హెబ్రోన్ మిషన్ స్కూల్, ప్రత్తి విజయకుమార్ ఆర్థికసాయం వీటిని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రత్తి అన్వేష్, పాస్టర్ శంకర్, ఏలీయా, భీమ్ బెహరా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శృతి ఎంపిక

నరసన్నపేట: మండలంలోని కంబకాయి జిల్లా పరిషత్ హైస్కూల్‌కి చెందిన విద్యార్థిని బగ్గు బువన శృతి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కోరాడ వైకుంఠరావు తెలిపారు. ఈ నెల 24న నిర్వహించనున్న జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళంలో 19న జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. ఈ విద్యార్థినికి పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.